


పాంబన్ వంతెన సిద్ధం
ట్రయల్ రన్ విజయవంతం

బ్రాడ్‌వేలో రూ.822.70 కోట్లతో బస్ టెర్మినల్



- మంత్రి శేఖర్‌బాబు

మలయాళ చిత్రాలకు సంగీతం సమకూరుస్తా



7లో

చెన్నైలో పలు చోట్ల ఈడీ తనిఖీలు

6లో



ఈపీఎస్‌తో అన్నాడీఎంకే నేతలు

ఈపీఎస్ వ్యాఖ్యలపై

మళ్లీ బీజేపీతో స్నేహమంటూ ప్రచారం

అన్నాడీఎంకేలో గందరగోళం

రాజకీయవర్గాల్లో కలకలం

అబ్బే! కమలంతో దోస్తీ ఎప్పటికీ ఉండదు ● సీనియర్ నేత జయకుమార్

చెన్నై, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భావసారూప్యత కలిగిన పార్టీలతో పొత్తు పెట్టుకుంటామంటూ అన్నాడీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో తీవ్ర దుమారం రేపాయి. నిన్నటి వరకూ 'బీజేపీతో తప్ప ఇతర పార్టీలతో పొత్తుకు సిద్ధ'మని చెప్పిన ఈపీఎస్.. హఠాత్తుగా ఈ వ్యాఖ్యలు చేయడంతో ఆయన మనసు మార్చుకున్నారంటూ రాజకీయవర్గాల్లో చర్చ రేగింది. దీనిపట్ల అన్నాడీఎంకేలో సైతం తీవ్ర గందరగోళం నెలకొంది. దీంతో ఆ పార్టీ సీనియర్‌నేత, మాజీ మంత్రి డి.జయకుమార్ పరిస్థితి చల్లబర్చేందుకు ప్రయత్నించారు. ఎప్పటికీ బీజేపీతో తమ పార్టీకి పొత్తు ఉండదంటూ గందరగోళానికి తెరదించేందుకు ప్రయత్నించారు.

అసలేం జరిగింది?

ఆదివారం సాయంత్రం ఈపీఎస్‌ను కలిసిన మీడియా ప్రతిధులు.. 'అన్నాడీఎంకే-బీజేపీ పొత్తు ఉంటుందా?' అని ప్రశ్నించగా ప్రజా వ్యతిరేక డీఎంకే ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు భావసారూప్యత కలిగిన పార్టీలన్నీ అన్నాడీఎంకే కూటమిలో చేరొచ్చని, వారితో తాము పొత్తు పెట్టుకుంటామని, ఎన్నికల నాటికి రాజకీయ వాతావరణాన్ని బట్టి ఏ కూటమిలోకి ఎవరు వస్తారు తేలుతుందని వ్యాఖ్యానించారు. డీఎంకే ఎన్నికల హామీల్లో 10 శాతం కూడా నెరవేర్చలేదని, పథకాల అమలుకు నిధులు

లేవని చెబుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్, ముత్తుక్కాడులో కలైంజర్ పేరుతో అంతర్జాతీయ స్థాయి థియేటర్ ఎందుకు నిర్మిస్తున్నారని ప్రశ్నించారు. అయితే పొత్తులకు సంబంధించి ఈపీఎస్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. 2024 పార్లమెంటు ఎన్నికల ముందు వరకు ఒకే కూటమిలో వున్న అన్నాడీఎంకే-బీజేపీ ఆ తరువాత జరిగిన పరిణామాల్లో విడిపోయాయి. కాషాయదళంతో కలిసి సాగితే రాష్ట్రంలోని మైనారిటీ వర్గాలతో పాటు ద్రావిడ సిద్ధాంతవాదులు సైతం తమను దూరంగా పెడుతున్నారని భావించిన ఈపీఎస్ బీజేపీతో కటీఫ్ చేసుకున్నారు. బీజేపీ అగ్రనేతలతో స్నేహ సంబంధాలున్నా, ఆ పార్టీతో మాత్రం కలిసి సాగేది లేదని స్పష్టం చేశారు. అయితే హఠాత్తుగా ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీ క్యాడర్‌లోనూ, రాజకీయవర్గాల్లోనూ గందరగోళానికి దారి తీశాయి.

బీజేపీతో ఎప్పటికీ కలవబోం - జయకుమార్

ఈపీఎస్ వ్యాఖ్యలతో రేగిన గందరగోళానికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకు అన్నాడీఎంకే సీనియర్‌నేత డి.జయకుమార్ ప్రయత్నించారు. సోమవారం అన్నాడీఎంకే క్షేత్రస్థాయి కమిటీ భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీతో ఎప్పటికీ కూటమి ఉండదని, ఇదే తమ పార్టీ వైఖరి అని స్పష్టం చేశారు. బీజేపీతో ఇప్పటికీ, ఎప్పటికీ పొత్తు లేదని, ఈ విషయమై పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదన్నారు. ఈ విషయమై పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి స్పష్టమైన వివరణ ఇచ్చారని, కానీ మీడియా దాన్ని వక్రీకరిస్తోందన్నారు. "ఏ రాష్ట్ర మంత్రి అయినా వ్యక్తిగతంగా ప్రధానితో భేటీ అయ్యారా? ప్రధాని మోదీతో కొందరు ముఖ్యమంత్రులు మాత్రమే చాలా అరుదుగా సమావేశమవుతుంటారు. రాష్ట్ర మంత్రులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయిన దాఖలాలు లేవు. కానీ రాష్ట్ర మంత్రి ఉదయనిధికి మాత్రం ప్రధానితో భేటీ అవకాశం వచ్చింది. ఇందులో మర్మమేంటో చెప్పగలరా?" అని జయకుమార్ ప్రశ్నించారు.

ఈపీఎస్‌తో అన్నాడీఎంకే క్షేత్రస్థాయి కమిటీ భేటీ

రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ పరంగా విభజించిన జిల్లాల్లో పార్టీ పనితీరు ఎలా వుంది, నిర్వాహకుల వ్యవహారశైలి ఎలా వుంది వంటి అంశాలను పర్యవేక్షించేందుకు ఇటీవల ఏర్పాటైన అన్నాడీఎంకే క్షేత్రస్థాయి కమిటీ సభ్యులు సోమవారం ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామితో భేటీ అయ్యారు. రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయమైన ఎంజీఆర్ మాళిగైలో జరిగిన ఈ సమావేశంలో డి.జయకుమార్, పి.వలర్మతి, దిండుగల్ శ్రీనివాసన్, తంగమణి, సీవీ షణ్ముగం, కేపీ మునస్వామి, తమిళ్ మగన్ హుస్సేన్, నత్తం విశ్వనాథన్, ఎస్పీ వేలుమణి, సెమ్మలై తదితరులు పాల్గొన్నారు. క్షేత్రస్థాయి కమిటీలో వున్నవారు తమకు కేటాయించిన 25 నియోజకవర్గాలకు వెళ్లి, కార్యకర్తలతో సమావేశమై, పార్టీ అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై చర్చించాలని, పార్టీ పదవుల్లో వున్నవారు తప్పులు చేసినట్లు గుర్తిస్తే ఆ వివరాలను డిసెంబరు 7వ తేదీ లోగా నివేదిక అందించాలని ఈపీఎస్ సూచించారు. ఒకవేళ జిల్లా కార్యదర్శులు తప్పు చేస్తే వారి గురించి కూడా నివేదికలో పొందుపరచాలని ఈపీఎస్ ఆదేశించారు.

బయటి వ్యక్తులతో పాఠాలు చెప్పిస్తే చర్యలు

చెన్నై, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లకుండా, తమకు బదులుగా వేరే వ్యక్తులతో పాఠాలు చెప్పిస్తే కఠిన చర్యలు చేపడతామని పాఠశాల విద్యాశాఖ హెచ్చరించింది. ధర్మపురి జిల్లా నామియాంపట్టి పంచాయతి యూనియన్ మాధ్యమిక పాఠశాల ఉపాధ్యాయుడు బాలాజీ ఇంటి పనులు చేసుకుంటూ.. తనకు బదులుగా వేరే వ్యక్తి చేత విద్యార్థులకు పాఠాలు చెప్పిస్తున్న విషయం అధికారుల తనిఖీలో వెల్లడైన విషయం తెలిసిందే. దీంతో బాలాజీని సస్పెండ్ చేసిన విద్యాశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. ఉపాధ్యాయులు మాత్రమే పాఠశాలలకు వెళ్లాలని, తమకు బదులుగా వేరే వ్యక్తులను పంపిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేసింది. సంబంధిత ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి, బాధ్యులైన వారిపై చర్యలు చేపట్టాలని ఆదేశించింది.

ఢిల్లీ గణేష్‌కు కన్నీటి వీడ్కోలు

● ముగిసిన అంత్యక్రియలు



ఢిల్లీ గణేష్ పార్థివదేహంపై జాతీయ జెండా కప్పుతున్న దృశ్యం



ఢిల్లీ గణేష్ (ఫైల్‌ఫొటో)

అడయార్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వయోభారం, అనారోగ్య సమస్యల కారణంగా శనివారం రాత్రి తుదిశ్వాస విడిచిన తమిళ సీనియర్ నటుడు ఢిల్లీ గణేష్ (80) అంత్యక్రియలు సోమవారం ముగిశాయి. నెసపాక్కంలోని హిందూ శ్మశానవాటికలో సంప్రదాయంగా ఈ తంతును ఆయన కుమారులు, కుటుంబ సభ్యులు పూర్తిచేశారు. ఈ అంత్యక్రియల్లో పలువురు నటీనటులు పాల్గొన్నారు. అంతకుముందు ఢిల్లీ గణేష్ పార్థివదేహానికి భారత వైమానిక దళ ఉన్నతాధికారులు నివాళులర్పించారు. తొలుత ఢిల్లీ గణేష్ భౌతికకాయంపై త్రివర్ణపతాకంతో కూడిన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ జెండా కప్పి సైనికులు గౌరవవందనం సమర్పించారు. ఆ తర్వాత ఉన్నతాధికారులు ఆయన భౌతికదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఢిల్లీ గణేష్ సినిమాల్లో నటించక ముందు ఢిల్లీలోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉన్నతోద్యోగిగా పనిచేసి, రాజీనామా చేసిన విషయం తెల్సిందే. అందుకే ఎయిర్‌ఫోర్స్ ఆయనకు గౌరవవందనం సమర్పించింది. కాగా రామాపురం నుంచి ఢిల్లీ గణేష్ భౌతికకాయాన్ని పూలతో అలంకరించిన వాహనంపై ఊరేగింపుగా శ్మశానవాటికకు తీసుకెళ్ళి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

ముఖాముఖి చర్చకు సిద్ధం

● ఈపీఎస్‌కు ఉదయనిధి సవాల్



ఛాంపియన్స్ కిట్ అందుకున్న క్రీడాకారులతో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎవరి ప్రభుత్వంలో మంచి పథకాలు అమలయ్యాయో తేల్చేందుకు ముఖాముఖి చర్చకు తాను సిద్ధమని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామికి సవాల్ విసిరారు. స్థానిక పెరియమేట్‌లోని నెహ్రూ స్టేడియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఉదయనిధి, రాణిపేట జిల్లాలో రూ.15 కోట్లతో చేపట్టిన 'జిల్లా క్రీడా మైదానం', మదురై జిల్లా క్రీడా మైదానంలో రూ.6 కోట్లతో నిర్మించనున్న 'ఒలింపిక్ అకాడమీ'లను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నగరం సమీపంలో స్పోర్ట్స్ విలేజ్ సమగ్ర ప్రణాళిక తయారవుతోందని, పూర్తయిన అనంతరం టెండర్లు ఆహ్వానించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఇటీవల ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి కొన్ని వ్యాఖ్యలు చేశారని, ఎవరి ప్రభుత్వ హయాంలో ఎన్ని మంచి పథకాలు చేపట్టామో తేల్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలకు కరుణానిధి పేరు పెట్టడంపై అభ్యంతరం చెబుతున్న ఈపీఎస్ ఎవరి పేర్లు పెట్టాలో చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర క్రీడాభివృద్ధి కమిషన్ హాస్టల్‌లో ఉంటున్న 553 మంది క్రీడాకారులకు 'ఛాంపియన్స్ కిట్'లను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి అందజేశారు.

ఆలిపై అరాచకం

● తిరువణ్ణామలైలో దారుణం
● భార్యను హత్య చేసి ముక్కలుగా కోసిన భర్త



శరణ్య(ఫైల్‌ఫొటో), భర్త గోపి

అడయార్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తన అల్లరి తిరుగుళ్లను నిలదీస్తోందన్న కోపంతో కట్టుకున్న భార్యను హతమార్చాడో దుర్మార్గుడు. అంతేగాక ఆమె శరీరాన్ని ముక్కలు చేసి, ఎవ్వరూ గుర్తు పట్టకుండా అటవీ ప్రాంతంలో విసిరేశాడు. అయితే పోలీసుల విచారణలో ఈ విషయం తేటతెల్లం కావడంతో చివరికి తను చేసిన తప్పును అంగీకరించాడు. తిరువణ్ణామలై జిల్లాలో కలకలం రేపిన ఈ హత్యోదంతం వివరాలిలా వున్నాయి..

తిరువణ్ణామలైలోని పేయిగోపురం మెయిన్ రోడ్డుకు చెందిన గోపి (36) మొదటి భార్యను వదిలేసి, 12 ఏళ్లక్రితం శరణ్య (29) అనే మహిళను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. ఈ క్రమంలో గత నెల 31వ తేదీ నుంచి శరణ్య కనిపించలేదు. ఆమె మొబైల్ ఫోన్ కూడా స్విచాఫ్ అయింది. తన తల్లి ఇంటికి రాకపోవడంతో కుమార్తె ఆందోళన చెందుతూ అమ్మమ్మకు చెప్పింది. ఆమె తమ కుటుంబ సభ్యులను విచారించినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో తిరువణ్ణామలై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో కృష్ణగిరి జిల్లా అటవీ ప్రాంతంలోని ఒక వంతెన కింది ఓ మహిళ మృతదేహం ముక్కలు ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడకు పోలీసులు వెళ్ళి చూడగా, ఆ శరీర భాగాలు శరణ్యవిగా తేలింది. అయితే, అక్కడ శరణ్య తల, హృదయభాగం, ఒక తొడ భాగం మాత్రమే లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకుని పంచనామా కోసం తరలించారు. అనంతరం గోపిని అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించడంతో అతను అసలు విషయం కక్కేశాడు. కొంతకాలంగా తమ భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పాడ్డాయని, దానికితోడు తనకు అప్పులు పెరగడంతో తమ మధ్య వివాదానికి కారణమైందని గోపి వెల్లడించాడు. తన తిరుగుళ్లను నిత్యం ఆమె నిలదీస్తుండడంతో భరించలేక హత్య చేశానని, అనంతరం ఎవ్వరూ గుర్తు పట్టకుండా శరీరాన్ని 8 ముక్కలుగా కోశానని అంగీకరించాడు. ఆమె శరీర భాగాలను తన తల్లి శివగామి, స్నేహితుడు రాజేంద్రన్ సాయంతో కృష్ణగిరి అటవీ ప్రాంతంలో పడేసినట్లు అంగీకరించాడు. ఈ హత్య కేసులో సహకరించిన తల్లి శివగామి, స్నేహితుడు రాజేంద్రన్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

మాతృభాషలో ఎందుకు మాట్లాడరు?

● మిమ్మల్ని విదేశాలకు పంపింది తమిళనాడే
● ప్రవాస తమిళులకు స్పీకర్ అప్పావు హితవు



మేయర్ ఆమిఈడెన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న స్పీకర్

చెన్నై, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): "మీరు ఇక్కడి వరకూ వచ్చారంటే తమిళనాడే కారణం. మిమ్మల్ని ఇంతదూరం పంపింది తమిళనాడే అన్న వాస్తవాన్ని గ్రహించండి. ఉద్యోగాల కోసం వచ్చిన తమిళుల్లో ఎక్కువమంది ఇంజనీరింగ్ పట్టభద్రులే. అయితే వారిలో చాలామంది మాతృభాషలో మాట్లాడడం లేదు. తమిళులు కలిసినప్పుడైనా తమిళంలో మాట్లాడకపోతే ఎలా?" అంటూ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అప్పావు ఆస్ట్రేలియాలోని తమిళులకు హితవు పలికారు. తమిళం మాత్రమే తెలిసిన పలువురు సింగపూర్, మలేసియా, శ్రీలంక తదితర దేశాలకు ఉద్యోగాల కోసం వెళ్తున్నారని, వారంతా ఐక్యతగా ఉండడం వల్లే సింగపూర్ వంటి దేశాల్లో తమిళం అధికార భాషగా ఉందన్న విషయం ప్రతి తమిళుడూ గ్రహించాలన్నారు. ఇక్కడున్న విద్యాసంస్థల్లో తమిళ పీఠం ఏర్పాటుకు అవసరమైన చర్యలను తమిళ సంఘాలు చేపట్టాలని, ఇందుకు అవసరమైన నిధులు ఇచ్చేందుకు స్టాలిన్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇటీవల సిడ్నీలో జరిగిన 67వ కామన్‌వెల్త్ పార్లమెంటరీ సమావేశంలో స్పీకర్ అప్పావు పాల్గొన్న విషయం తెలిసిందే. సోమవారం సిడ్నీ నుంచి మెల్‌బోర్న్ చేరుకున్న అప్పావు అక్కడి తమిళ సంఘం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం భారతదేశంలో జాతీయత అంటే ఏమిటి? ద్రావిడం అంటే ఏమిటి అనే సందేహం రేగుతోందన్నారు. ఈ సభలో తాను తమిళుడిగా పాల్గొనప్పటికీ, తమిళ స్ఫూర్తితో భారతీయుడిగా జీవించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. జాతీయత, ద్రావిడం వేరుచేయాల్సిన అవసరం లేదని సిడ్నీ పర్యటన ద్వారా అర్థమైందన్నారు. తమిళులు ప్రపంచంలో ఎక్కడున్నా వారి గుర్తింపు భారతదేశమేనని, ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం కూడా భారతదేశమేనని అన్నారు. ప్రతి దేశానికి ప్రత్యేక చట్టం ఉందని, ఆ రాజ్యాంగం కింద ప్రజలందరూ జీవిస్తున్నారని, నిర్దేశించిన చట్టాలకు లోబడి జీవిస్తేనే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమం అనంతరం ఆస్ట్రేలియా కేరీస్ ప్రాంతీయ కౌన్సిల్ మేయర్ ఆమిఈడెన్‌తో స్పీకర్ అప్పావు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

సమాచార దర్శిని

నేటినుంచి వక్తృత్వ పోటీలు

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నారు. పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఉదయం 9 గంటలకు ఉత్తర చెన్నై పరిధిలో విల్లివాక్కం ప్రభుత్వ మహోన్నత పాఠశాల, దక్షిణ చెన్నై పరిధిలో నందనం ప్రభుత్వ మోడల్ మహోన్నత పాఠశాల, మధ్య చెన్నై పరిధిలో ట్రిప్లికేన్ సీమాట్టి విలింగ్టన్ ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలలో పోటీలు జరుగనున్నాయి. కళాశాల విద్యార్థులకు బుధవారం ఉదయం 9గంటలకు ఉత్తర చెన్నై పరిధిలో ఆర్కే నగర్ ప్రభుత్వ కళాశాల, మధ్య చెన్నై పరిధిలో చేపాక్కం రాజధాని కళాశాల, దక్షిణ చెన్నై పరిధిలో రాణిమేరీ కళాశాలలో పోటీలు జరుగనున్నాయి. మొదటి మూడు స్థానాల్లో నిలిచే విద్యార్థులకు రూ.5,000, రూ.3,000, రూ.2,000 బహుమతిగా ఇవ్వనున్నారు. పాఠశాల విద్యార్థులకు నిర్వహించే పోటీల్లో మొదటి మూడు స్థానాలు నిలిచిన విద్యార్థులతో పాటు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన మరో ఇద్దరు విద్యార్థులకు తలా రూ.2,000 బహుమతి, ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు టీడీపీ సభ్యత్వ నమోదు

చెన్నై, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం జరుగనుంది. అన్నానగర్ టవర్ క్లబ్ మీటింగ్ హాలులో సాయంత్రం 5 గంటలకు జరుగనున్న ఈ కార్యక్రమానికి విజయనగరం పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని టీడీపీ వర్గాలు తెలిపాయి. చెన్నైలో నివాసముంటున్న టీడీపీ అభిమానులు, తెలుగు వారి కోసం టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సూచనలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, సభ్యత్వ నమోదులో తెలుగుదేశం పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ వర్గాలు విజ్ఞప్తి చేశాయి.

వైద్య శాఖలో ఉద్యోగాల భర్తీకి జనవరి 27న ఆన్‌లైన్ పరీక్ష

పెరంబూర్,నవంబరు11(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖలో 2,553 ఉద్యోగాల భర్తీకి జనవరి 27వ తేది ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. ఈపోస్టుల భర్తీకి సంబంధించిన దరఖాస్తు స్వీకరణ ముగిసిన నేపథ్యంలో 25వేల మంది దరఖాస్తు చేసుకున్నారు.పోస్టుల భర్తీకి సంబంధించిన రాతపరీక్ష ఆన్‌లైన్‌లో జనవరిలో నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి, అన్నాసాలై, అన్నానగర్, పొన్నేరి ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సమస్యల పరిష్కార శిబిరాలు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. అన్నాసాలై పరిధిలో చింతాద్రిపేటలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, అన్నానగర్ పరిధిలో 5వ వీధిలోని హెచ్ బ్లాక్‌లో ఉన్న కార్యాలయం, గిండి పరిధిలో నంగనల్లూర్ హిందూ కాలనీలోని కార్యాలయం, పొన్నేరి పరిధిలో వెంబాక్కంలోని 33/11 ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణంలో ఉదయం 11 గంటల నుంచి ఈ శిబిరాలు నిర్వహించనున్నారు. విద్యుత్ కనెక్షన్లు, విద్యుత్ బిల్లుల సమస్యలు సహా ఇతర విద్యుత్ సేవలపై ఆయా ప్రాంతాల ప్రజలు ఫిర్యాదుచేసి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు తెలియజేసింది.

హాస్టళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ విద్యార్థులు కళాశాల హాస్టళ్లలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని చెన్నై జిల్లా కలెక్టర్ రశ్మి సిద్ధార్థ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో కొత్తగా ప్రారంభించిన మైనార్టీ కళాశాల విద్యార్థుల హాస్టల్ గిండిలోని బీసీ సంక్షేమ హాస్టల్‌తో కలసి నిర్వహిస్తున్నారు. డిగ్రీ, వృత్తి విద్యా కోర్సులు చేసే మైనార్టీ విద్యార్థులకు ఈ హాస్టల్‌లో మూడు పూటలా భోజనం, వసతి కల్పించనున్నారు. అలాగే, అత్యవసరాలకు నెలకు రూ.150 వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేయనున్నారు. చెన్నై జిల్లా మినహా ఇతర జిల్లాలకు చెంది, వార్షికాదాయం రూ.2 లక్షల లోపున్న కుటుంబాలకు చెందిన విద్యార్థులు హాస్టల్‌లో చేరేందుకు అర్హులు. ఆసక్తి కలిగిన విద్యార్థులు హాస్టల్ వార్డెన్, కలెక్టర్ కార్యాలయం ప్రాంగణం 6వ అంతస్తులోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని కలెక్టర్ తెలపారు.

23వ తేదిలోగా వైద్య విద్యార్థుల వివరాలు

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ కోర్సుల్లో చేరిన విద్యార్థుల వివరాలను ఈ నెల 23వ తేదిలోగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ఆదేశించింది. దేశంలోని వైద్యకళాశాలల్లో ఎంబీబీఎస్‌లో అడ్మిషన్లు ఎన్ఎంసీ మార్గదర్శకాలతో జరిగింది. ప్రస్తుత విద్యా సంవత్సరం ఎంబీబీఎస్‌లో చేరిన విద్యార్థుల వివరాలు, వారి సాధించిన మార్కులు, రిజర్వేషన్, ఫీజు వివరాలను ఎన్ఎంసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఈ నెల 8వ తేది వరకు గడువు విధించగా, కళాశాలల విజ్ఞప్తి మేరకు 23వ తేది వరకు గడువు పొడిగించినట్లు ఎన్ఎంసీ తెలిపింది.

పీజీ సీట్ల పెంపు దరఖాస్తు... : ఎండీ, ఎంఎస్ తదితర పీజీ కోర్సులు ప్రారంభించేందుకు, ఇప్పటికే ఉన్న సీట్ల సంఖ్య పెంచుకొనేలా వైద్యకళాశాలలు దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్ఎంసీ ప్రకటించింది. దరఖాస్తు గడువు రెండు సార్లు పొడిగించగా, ఆయా కళాశాలల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు గడువు ఈ నెల 22వ తేది వరకు పొడిగించినట్లు ఎన్ఎంసీ తెలిపింది.

కూలిన ఎంఎంసీ హాస్టల్ భవనం

● ముగ్గురు పాదచారులకు గాయాలు



కూలిన భవనం

ప్యారీస్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడ్‌వే బస్టాండ్ సమీపంలో ఉన్న మద్రాస్ మెడికల్ కళాశాల (ఎంఎంసీ) హాస్టల్ భవనం కూలిన ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. ఎంఎంసీ పీజీ విద్యార్థుల కోసం బ్రాడ్‌వే ప్రాంతంలో నిర్మించిన హాస్టల్ భవనాన్ని 1959 జూలై 18వ తేది అప్పటి ముఖ్యమంత్రి కామరాజర్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో 4.24 ఎకరాల ఎంఎంసీ హాస్టల్ భవనం ఉన్న ప్రాంతాన్ని న్యాయశాఖకు కేటాయించి, ఉమ్మడి కోర్టు భవనాలు నిర్మించనున్నట్లు రెండేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ తర్వాత ఆ హాస్టల్‌లో ఉన్న విద్యార్థులను ఖాళీ చేయించారు. ఇదిలా ఉండగా, సోమవారం ఉదయం ఈ భవనంలోని ఒక భాగం హఠాత్తుగా కూలింది. ఆ సమయంలో బ్రాడ్‌వే బస్టాండ్‌కు నడిచివెళ్తున్న విశ్వనాథన్, చొక్కలింగం, సుబ్రమణ్యంలకు గాయాలయ్యాయి. వీరిని వెంటనే రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించిన పోలీసులు, ఈ ప్రమాదంపై కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

లబ్ధిదారులకు సంక్షేమ సహాయాల పంపిణీ



లబ్ధిదారులకు సహాయాలు అందజేస్తున్న ఎంపీ కదిర్ ఆనంద్, కలెక్టర్ సుబ్బులక్ష్మి తదితరులు

వేలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేవీ కుప్పం నియోజకవర్గంలో సోమవారం 'ప్రజలతో ముఖ్యమంత్రి' కార్యక్రమం జరిగింది. కేవీ కుప్పం లోని ఓ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ కదిర్ ఆనంద్, కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని, ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో 62 మందికి ఇళ్ల పట్టాలు, 43 మందికి పేర్ల మార్పి ఇళ్ల పట్టాలు అందజేశారు. అలాగే, వివిధ శాఖల ఆధ్వర్యంలో 568 మంది లబ్ధిదారులకు రూ.3.74 కోట్ల విలువైన సహాయాలు అందజేశారు. కార్యక్రమంలో గుడియాత్తం ఎమ్మెల్యే అమ్ములు విజయన్, కేవీ కుప్పం యూనియన్ కమిటీ అధ్యక్షుడు రవిచంద్రన్, గుడియాత్తం సత్యానందం, పంచాయతీల కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి, సీతారామన్, ప్రత్యేక సబ్ కలెక్టర్ కలియమూర్తి, గుడియాత్తం రెవెన్యూ తహసీల్దార్ సుబలక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రిటైర్డ్ డీజీపీ కేసు రాజకీయంగా చూడొద్దు

● మద్రాసు హైకోర్టు

ప్యారీస్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ డీజీపీ సునీల్‌కుమార్‌కు వ్యతిరేకంగా దాఖలైన కేసుపై వెంటనే విచారణ జరపాల్సిన అవసరం లేదని, ఈ వ్యవహారాన్ని రాజకీయంగా చూడొద్దని మద్రాసు హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. తమిళనాడు పోలీసు ఉద్యోగుల ఎంపిక బోర్డు ఛైర్మన్‌గా రిటైర్డ్ డీజీపీ సునీల్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. ఈ నియామకం రద్దు చేయాలని కోరుతూ అన్నాడీఎంకే న్యాయవాద విభాగం రాష్ట్ర కార్యదర్శి ఇన్బదురై హైకోర్టులో పిటిషన్ వేశారు. విచారణ జరిపిన న్యాయస్థానం, పిటిషన్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సునీల్‌కుమార్ సమాధానం చెప్పాలని ఆదేశించి తదుపరి విచారణను ఈ నెల 11వ తేదీకి వాయిదావేసింది. కానీ, సోమవారం విచారణ జాబితాలో ఈ పిటిషన్ లేకపోవడంతో పిటిషనర్ తరఫున న్యాయవాది హైకోర్టు న్యాయమూర్తి భవాని సమక్షంలో హాజరై, సునీల్‌కుమార్ కేసు వెంటనే విచారణకు స్వీకరించాలని కోరారు. ఇందుకు అభ్యంతరం తెలిపిన న్యాయమూర్తి, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయంలో జోక్యం చేసుకోవడం సరికాదని, ఇలాంటి కేసులకు రాజకీయ రంగు పులమరాదని సూచించింది.

పార్క్‌రైల్వేస్టేషన్‌లో ఎమ్మార్టీఎస్ రైళ్లకు హాల్ట్

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చెన్నై బీచ్-వేళచ్చేరి మధ్య నడుస్తున్న ఎమ్మార్టీఎస్ రైళ్లు పార్క్ రైల్వేస్టేషన్‌లో సోమవారం ఆగనున్నాయి. చెన్నై బీచ్-ఎగ్మూర్ మధ్య నాలుగో రైలు మార్గం పనుల కారణంగా గత ఏడాది ఆగస్టు నుంచి చెన్నై బీచ్-వేళచ్చేరి మధ్య నడిచే ఎమ్మార్టీఎస్ రైళ్లను చెన్నై బీచ్‌కు బదులుగా చింతాద్రిపేట నుంచి నడిపారు. రైలు మార్గం నిర్మాణ పనులు 90 శాతం పూర్తి కావడంతో, ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు, ఎమ్మార్టీఎస్ రైళ్లను యథావిధిగా చెన్నై బీచ్ నుంచి నడిపారు. కానీ, పార్క్ రైల్వేస్టేషన్ పైకప్పు ఏర్పాటు కారణంగా ఎమ్మార్టీఎస్ రైళ్లు పార్క్ రైల్వేస్టేషన్‌లో ఆగవని దక్షిణ రైల్వే ప్రకటించింది. ఈ నేపథ్యంలో, పనులు పూర్తికావడంతో సోమవారం నుంచి ఎమ్మార్టీఎస్ రైళ్లు పార్క్ రైల్వేస్టేషన్‌లో ఆగుతాయని అధికారులు తెలిపారు.

వైద్యసేవలపై అభిప్రాయ సేకరణ

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో చేస్తున్న వైద్య సేవలపై రోగుల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నారు. ఈ మేరకు ఆరోగ్యశాఖ డైరెక్టర్ సెల్వవినాయగం విడుదల చేసిన ఉత్తర్వుల్లో ప్రభుత్వాస్పత్రుల్లో ఆధునిక పరికరాలు, మౌలిక వసతులు కల్పించి రోగులకు మెరుగైన వైద్యం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. అలాగే, ప్రభుత్వాసుపత్రుల్లో అందిస్తున్న సేవలు, చికిత్స, మందుల పంపిణీ, మౌలిక వసతులు తదితర అంశాలపై రోగుల నుంచి అభిప్రాయాలు సేకరించాలన్నారు. వారానికి 10 మంది రోగుల నుంచి అభిప్రాయాలు తీసుకుని, ప్రతి నెలా 14వ తేదిలోగా ఆరోగ్యశాఖకు మెయిల్ చేయాలని ఆయన ఉత్తర్వులో పేర్కొన్నారు.

కార్యక్రమాలకు కార్లలో రావొద్దు: పీఎంకే

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఆధ్వర్యంలో జరిగే సమావేశాలు, ఆందోళనలు, మహానాడు తదితరాలకు జిల్లా కార్యదర్శులు కార్లలో రావొద్దని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన తన 'ఎక్స్' పేజీలో... పార్టీ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలకు జిల్లా కార్యదర్శులు ఎక్కువ మంది కార్లలో వస్తున్నట్లు తెలిసిందన్నారు. కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కార్యకర్తలతో కలిసి బస్సు, వ్యాన్ తదితర వాహనాల్లో రావాలని, ఈ విషయాన్ని జిల్లా కార్యదర్శులంతా పాటించాలని రాందాస్ తెలియజేశారు.

14న తిరువణ్ణామలైలో మూడు గంటలు దర్శనం రద్దు

ప్యారీస్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో ఈ నెల 14వ తేది అన్నాభిషేకం నిర్వహించనున్న సందర్భంగా మూడు గంటల పాటు స్వామివారి దర్శనం రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రతి ఏటా తిరువణ్ణామలై క్షేత్రంలో అన్ని జీవరాశులకు ఆహారం అందిస్తున్న శివపరమాత్ముడికి ఐపసి పౌర్ణమి సందర్భంగా అన్నాభిషేకం చేయడం ఆనవాయితీ. గురువారం అరుణాచలేశ్వరాలయంలో నిర్వహించనున్న అన్నాభిషేకం సందర్భంగా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూలవిరాట్టు సన్నిధిని తాత్కాలికంగా మూసివేస్తారు. అన్నాభిషేకం అనంతరం మళ్లీ సాయంత్రం 6 నుంచి యథావిధిగా భక్తులను దర్శనానికి అనుమతించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఏడు జిల్లాల్లో పెరిగిన భూగర్భ జలాలు

వేళచ్చేరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నా సెప్టెంబరుతో పోల్చితే అక్టోబరులో 7 జిల్లాల్లో మాత్రమే భూగర్భ జలమట్టం పెరిగింది. రాష్ట్ర జలవనరుల శాఖ రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యికి పైగా మానిటరింగ్ బావుల ద్వారా నెలవారీ భూగర్భ జలమట్టాలు గణిస్తోంది. ఆ ప్రకారం సెప్టెంబరుతో పోలిస్తే అక్టోబరులో కృష్ణగిరి, తిరుచ్చి, అరియలూరు, నీలగిరి, శివగంగ, తేని, తిరునల్వేలి తదితర ఏడు జిల్లాల్లో మాత్రమే భూగర్భ జలమట్టం పెరిగిన నేపథ్యంలో, మిగిలిన 30 జిల్లాల్లో తగ్గింది. రాష్ట్రంలో అత్యధికంగా కృష్ణగిరి జిల్లాలో 9.63 మీటర్లు పెరుగ్గా, ధర్మపురి జిల్లాలో నీటిమట్టాలు 1.35 మీటర్లు తగ్గాయని జలవనరుల శాఖ తెలిపింది.

అధికార మార్పిడిపై ఇప్పుడేం చెప్పలేం

● బన్రుట్టి రామచంద్రన్

అడయార్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రానున్న అసెంబ్లీ ఎన్నికల తర్వాత అధికార మార్పిడి జరుగుతుందా లేదా అన్నది ఇప్పుడే చెప్పలేమని, ఆ ఎన్నికల కోసం విపక్ష పార్టీలు ఏర్పాటు చేసే బలమైన కూటమిపై ఆధారపడి వుంటుందని మాజీ మంత్రి బన్రుట్టి రామచంద్రన్ అభిప్రాయపడ్డారు. ఆయన తన 88వ పుట్టిన రోజు వేడుకలను ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో డీఎంకే కూటమి 200 స్థానాల్లో గెలుస్తుందని చెప్పడం ఆ కూటమి నేతల ఆత్మ విశ్వాసానికి, కూటమి బలానికి ప్రతీక అని అన్నారు. డీఎంకే కూటమిని దీటుగా ఎదుర్కొనే విపక్ష కూటమి కనుచూపు మేరలో లేదన్నారు. వచ్చే ఎన్నికల కోసం విపక్ష పార్టీలు కలిసి బలమైన కూటమిని ఏర్పాటు చేసే అంశంపైనే అధికార మార్పిడి జరుగుతుందా లేదా అన్నది ఆధారపడుతుందన్నారు. టీవీకేతో అన్నాడీఎంకే పొత్తు పెట్టుకుంటుందనే ప్రచారం జరుగుతుందనీ, అలా జరిగితే ఎవరు ముఖ్యమంత్రి అనే విషయంపై సమస్య ఏర్పడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎడప్పాడి పేరు ప్రకటిస్తే విజయ్ అంగీకరించరని, సీఎం అభ్యర్థిగా విజయ్ పేరును ప్రతిపాదిస్తే ఎడప్పాడి ఒప్పుకోరని బన్రుట్టి రామచంద్రన్ అభిప్రాయపడ్డారు.

మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన

వేలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి సెంగుట్టైలో సోమవారం మాదకద్రవ్యాల అనర్థాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కాట్పాడి డీఎస్పీ పళని అధ్యక్షత వహించి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, వాడకం ద్వారా జరిగే నేరాలు, శారీరకంగా కలిగే ఇబ్బందులు తదితరాలపై వివరించారు. కార్యక్రమంలో కాట్పాడి ఎక్సైజ్ అధికారి ఆనందన్, ఎస్ఐ మణికంఠన్, ప్రత్యేక బ్రాంచ్ కానిస్టేబుల్ గోపినాథ్, కౌన్సిలర్లు అన్బు, చిత్ర, మహేంద్రన్, వినాయకమ్, ప్రజలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై దృష్టి సారించండి

● కార్యకర్తలకు టీవీకే 'మెసేజ్'

వేళచ్చేరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా సవరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పిలుపునిచ్చింది. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు పూర్తయిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు, ఓటరు జాబితాలో పేర్లు చేర్పు, తొలగింపు, చిరునామా, సెల్ ఫోన్ నెంబరు మార్పు తదితరాలను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపట్టింది. అందుకోసం, ఈ నెల 16,17,23,24 తేదీల్లో అన్ని పోలింగ్ బూత్‌ల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా టీవీకే కార్యకర్తలకు పంపిన మెసేజ్‌లో.... ఓటరు జాబితా సవరణపై ప్రజల్లో అవగాహన కల్పించేలా కరపత్రాలు అందజేసి ప్రచారం చేపట్టాలన్నారు. జిల్లా, తాలూకా, పంచాయతి, వార్డు శాఖల పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు శిబిరాలు జరిగే నాలుగు రోజులు ఓటరు జాబితా సవరణ పనులు పర్యవేక్షించాలని పార్టీ పిలుపునిచ్చింది.



ప్రారంభోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

సిద్ధ, ఆయుర్వేద కేంద్రం ప్రారంభం

వేలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆదిత్య వెల్నెస్ ఫాం ఆధ్వర్యంలో సిద్ధ, ఆయుర్వేద, హీలింగ్ కేంద్రం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్వర్ణం నటరాజన్, శివగంగ జిల్లా మెడికల్ షాప్ రాజేష్, డా.నరసింహన్, రోహిణి సహా పలువురు పాల్గొన్నారు.



వేలూరు జిల్లా గుడియాత్తం పురపాలకోన్నత పాఠశాలలో సోమవారం దివ్యాంగులకు గుర్తింపు కార్డులందించే శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్న ప్రాంతాలివే..

అన్నాసాలై: భూత పెరుమాల్ ఆలయ వీధి, పెరుమాళ్ వీధి, ఈబీ లింక్ రోడ్డు, కల్యాణి కన్‌స్ట్రక్షన్స్, కాస్మోపాలిటన్ క్లబ్, దేవి థియేటర్ కాంప్లెక్స్, శ్రీలేఖ ఆర్ఎంజీ కాంప్లెక్స్, కస్తూరి కన్‌స్ట్రక్షన్స్, సారధి థియేటర్ కాంప్లెక్స్, అన్నాసాలైలో కొంత భాగం, ఎంవీఎస్ క్లబ్ బిల్డింగ్, ఎల్లీస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, 804 అన్నాసాలై కాంప్లెక్స్, ఏవీఏ టవర్స్ బిల్డింగ్ కాంప్లెక్స్, స్టేట్ బ్యాంక్, జమ్మూకశ్మీర్ బ్యాంక్, 787, అన్నాసాలై రాయలా టవర్స్ బిల్డింగ్, జీపీ రోడ్డులో కొంత భాగం, పూబేగం వీధి, ఎస్ఎస్‌జీ రోడ్డు, మోహన్ దాస్ రోడ్డు, బర్డర్ గార్డెన్, పచ్చయప్ప ట్రస్ట్ బిల్డింగ్, ఎల్ఐసీ బిల్డింగ్ కాంప్లెక్స్, ప్రిన్స్ కుషాల్ టవర్స్ కాంప్లెక్స్, గౌతం టవర్స్, వెల్లింగ్టన్ ప్లాజా కాంప్లెక్స్, బేగం సాహెబ్ వీధి, సామి ఆచారి వీధి, సుబేదార్ రకల్ 1వ వీధి, సయ్యద్ అబ్దుల్లా వీధి, సామి ఆచారి వీధి, నైనియప్ప వీధి, బంగారు నాయకన్ వీధి, కుప్పు ముత్తు వీధి, వాలర్స్ రోడ్డు, డేమ్స్ రోడ్డు, కరీమ్‌మొహిద్దీన్ వీధి, తారాపూర్ టవర్స్, తున్ బిల్డింగ్స్ శారదా సిల్క్ ఎంపోరియం, అన్నాసాలై ప్రధాన తపాలా కార్యాలయం, బిలాకర్స్ రోడ్డు, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, స్టేట్ బ్యాంక్ సెయింట్, ఆర్ముగం వీధి, వెల్డర్స్ వీధి, బైరుంగ్‌జంగ్ పత్తార్ వీధి, హరీష్ రోడ్డు, చంద్రభాను వీధి, సీపీఎం వీధి, సామిచెట్టి వీధి, పుదుపేట పోలీసు క్వార్టర్స్, నరియంగాడు క్వార్టర్స్, లబ్బై వీధి, నారాయణన్ నాయకన్ 1 నుంచి 12 వీధులు, డ్రైవర్ వీధి, మీర్‌మదన్ అలి వీధి, తులిసింగం వీధి, బాషా 1 నుంచి 12 వీధులు, సుబ్బరాయన్ వీధి, అబ్దుల్ సుగన్ వీధి, అబ్దుల్ హుస్సేన్ వీధి, వేలాయుధం వీధి, వేలాయుధం ఆచారి వీధి, వేలాయుధం చెట్టి 1 నుంచి 12 వీధులు, ఆషాహుస్సేన్ వీధి, ఎల్లప్పన్ 1 నుంచి 12 వీధులు, మునిపిళ్లై వీధి, ఏకప్పన్ వీధి, మునుస్వామి లైన్, జయసామి వీధి, సైఫుల్‌ముల్క్ వీధి, సౌత్ కూవం వీధి, వీరభద్రన్ వీధి, రవాణా దళం.

కోయంబేడు: కోయంబేడు మార్కెట్, చిన్మయా నగర్, నెర్‌కుండ్రం, ఆళ్వార్ తిరు నగర్, మూకాంబిగై నగర్, అళగమ్మాల్ నగర్, కృష్ణా నగర్, భువనేశ్వరి నగర్, పెరుమాళ్ ఆలయ వీధి, జయలక్ష్మి నగర్, ఎన్టీ పటేల్ రోడ్డు, పల్లవన్ నగర్, చెట్టి వీధి, బీహెచ్ రోడ్డు.

ఆర్ఏ పురం: ఆర్ఏ పురం, ఎమ్మార్సీ నగర్, ఫోర్‌షోర్ ఎస్టేట్ కొంత భాగం, గాంధీ నగర్‌లో కొంత భాగం, పీఆర్వో క్వార్టర్స్, ఆర్కే మఠం, ఆర్కే నగర్, రాణిమెయ్యమ్మై టవర్, సత్యదేవ్ అవెన్యూ, ట్రూవాల్యూ హోమ్స్, రాజా వీధి, రాబర్ట్‌సన్ లైన్, రాజా గ్రామణి గార్డన్, కేవీపీ గార్డన్, అప్పా గ్రామణి వీధి, వేలాయుధరాజా వీధి, టీబీ స్కీమ్ వీధి, రాజా ముత్తయ్యాపురం, కుట్టిగ్రామణి వీధి, కామరాజ్ రోడ్డు, కస్తూరి అవెన్యూ, కర్పగం అవెన్యూ, వసంత్ అవెన్యూ, సౌత్ అవెన్యూ, షణ్ముగపురం, శాంతోమ్ హైరోడ్డు, సత్య నగర్, అరింజర్ అన్నానగర్, అన్నై థెరిస్సా నగర్, పెరుమాళ్ ఆలయ వీధి, సౌత్ కెనాల్ బ్యాంక్ రోడ్డు.

షోలింగనల్లూర్: కైలాష్ నగర్, ఆంటోని నగర్, కృష్ణా నగర్, రాధా నగర్, సౌమ్య నగర్, మాంబాక్కం మెయిన్ రోడ్డు, గాంధీ నగర్, నూక్కంపాళయం రోడ్డు కొంత భాగం, చేరన్ నగర్, బాబు నగర్, సీబీఐ కాలనీ, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, పొన్నియమ్మన్ ఆలయ వీధి, పిళ్లయార్ ఆలయ వీధి, భజన ఆలయ వీధి, మాజీ సైనికుల కాలనీ, పల్లవన్ నగర్, ఎల్లార్ అవెన్యూ, మునుస్వామి నగర్, మేడవాక్కం మెయిన్ రోడ్డు, రంగనాథపురం, పటేల్ రోడ్డు, ప్రిన్స్ కాలేజ్, శివగామి నగర్, సరస్వతి నగర్, నల్లతంబి నగర్, ఏరికరై రోడ్డు, విమల నగర్, మీనాక్షి నగర్, రాజ్యలక్ష్మి నగర్, సాయిగణేష్ నగర్, సాయిబాలాజి నగర్, రాజా నగర్, ఆర్ఎస్ నగర్, శఠగోపన్ నగర్, జల్లడియన్‌పేట ప్రాంతం, కృష్ణా నగర్, ధర్మలింగం నగర్, వివేకానంద నగర్, వల్లల్‌పారి నగర్, గణపతిపురం.

గంజాయిపై ఉక్కుపాదం

● ఒకే రోజు 21 కిలోల స్వాధీనం
● ఏడుగురి అరెస్టు



ప్యారీస్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో గంజాయి విక్రయాలు రోజురోజుకు పెరుగుతుండడంతో పోలీసులు నిఘా సారించారు. సోమవారం ఒక్కరోజే 21 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక కొడుంగైయూర్ ఎంఆర్ నగర్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసులు ముగ్గుర్ని అదుపులోకి తీసుకొని 21 కిలోల గంజాయి, వంద మి.గ్రా గంజాయి ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. కొడుంగైయూర్ సీఐ శరవణన్ నేతృత్వంలోని పోలీసులు ఎంఆర్ నగర్ వడివుడియమ్మన్ ఆలయ వీధిలో అనుమానాస్పదంగా సంచిస్తున్న ముగ్గుర్ని ఆదివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. విచారణలో... అదే ప్రాంతానికి చెందిన బాబు (33), సాయిచరణ్ (30), ధనుష్ (20)గా గుర్తించారు. వారిచ్చిన సమాచారంతో దినేష్‌బాబు అనే జిమ్ మాస్టర్, తిరువిక నగర్‌కు చెందిన రాజేష్, వేలూరుకు చెందిన శ్యామ్, పెరియపాళయంకు చెందిన ప్రసన్నను అరెస్ట్ చేశారు. ఆంధ్ర నుంచి గంజాయి దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నట్లు వారు విచారణలో అంగీకరించినట్లు సమాచారం. సోమవారం ఉదయం వీరిని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

కిలో గంజాయితో ఆరుగురు విద్యార్థుల అరెస్ట్...

కోవైలోని ఓ హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసులు కిలో గంజాయి స్వాధీనం చేసుకొని ఆరుగురు విద్యార్థులు సహా ఏడుగురిని అరెస్ట్ చేశారు. కోవైలోని పలు ప్రాంతాల్లో కళాశాలల విద్యార్థులుంటున్న అపార్ట్‌మెంట్లు, పీజీ హాస్టళ్లలో పోలీసులు ఆదివారం తనిఖీలు చేసిన విషయం తెలిసిందే. ఈ తనిఖీల్లో ఆరుగురు విద్యార్థులు సహా ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి కిలో గంజాయి చాక్లెట్లు, హుక్కా పైపుతో పాటు 9 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

చెన్నైలో ఆరు చోట్ల ఈడీ తనిఖీలు

అడయార్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోమవారం ఆరు చోట్ల తనిఖీలు చేపట్టారు. రాజాఅన్నామలైపురం అభిరామిపురానికి ఎందిన అరవింద్ గుప్తా, కౌశిక్ అనే పారిశ్రామికవేత్తల ఇళ్లు, కార్యాలయాల్లో ఈ సోదాలు జరిగాయి. తిరువళ్ళూరు జిల్లా గుమ్మడిపూండిలో సోలార్ విద్యుత్ పరికకాల ఫ్యాక్టరీ నడుపుతున్న అరవింద్ గుప్తాకు చెందిన అభిరామిపురం నివాసంలో సోమవారం ఉదయం 7 గంటలకు ఐదుగురు అధికారులు తనిఖీ చేశారు. అలాగే, కౌశిక్ అనే వ్యాపారవేత్త ఇంటిలో కూడా ఈ సోదాలు జరిగాయి. అరవింద్ గుప్తాకు కీల్పాక్కం, రాజా అన్నామలైపురం, తేనాంపేట, సైదాపేటతో సహా ఆరు ప్రాంతాల్లో కార్యాలయాలుండగా, వాటిలో ఏక కాలంలో ఈడీ అధికారులు సోదా చేశారు. గుమ్మిడిపూండిలోని ఫ్యాక్టరీలో ఎనిమిది మంది అధికారుల బృందం తనిఖీలు చేపట్టింది. చట్ట వ్యతిరేక నగదు లావాదేవీలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో ఈ సోదాలు జరిగాయి.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

ప్యారీస్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు రాంపాళయం గ్రామానికి చెందిన శక్తివేల్, కవితల ప్రేమ పెళ్లికి కుటుంబ సభ్యులు అభ్యంతరం తెలియజేయడంతో ఆ జంట చెంగల్పట్టు పోలీసులను ఆశ్రయించింది. ఈ నెల 6వ తేది ఉదయం ఉద్యోగానికి వెళ్లిన కవిత (20) రాత్రికి ఇంటికి రాకపోవడంతో ఆమె కోసం గాలించిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి ఆమె కోసం పోలీసులు గాలించారు. ఈ నేపథ్యంలో, అదే ప్రాంతానికి చెందిన శక్తివేల్ (23)ను ప్రేమించిన కవిత, ఒకే ఇంట్లో సహజీవనం చేస్తున్నట్లు తల్లిదండ్రులకు సమాచారం తెలిసింది. దీంతో, కవిత తల్లిదండ్రులు శక్తివేల్‌ను వదిలి ఇంటికి రావాలంటూ ఒత్తిడి చేసినట్లు తెలిసింది. దీంతో, తమకు రక్షణ కల్పించాలంటూ ప్రేమ జంట పోలీసులను ఆశ్రయించింది. ఈ వ్యవహారంలో పోలీసులు ఇరువురి కుటుంబ సభ్యులతో చర్చిస్తున్నట్లు సమాచారం.

ఉదయకుమార్ అనుచరులపై దాడి

● ముగ్గురికి గాయాలు

అడయార్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి ఆర్‌బీ ఉదయకుమార్ అనుచరులపై అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ వర్గానికి చెందిన కార్యకర్తలు దాడి చేశారు. దాడిలో ఉదయకుమార్ వర్గానికి ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దాడికి సంబంధించి ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మదురై జిల్లా ఉసిలంపట్టికి సమీపంలోని అత్తిపట్టిలో ఆదివారం సాయంత్రం అన్నాడీఎంకే సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఇందులో మాజీ మంత్రి ఆర్‌బీ ఉదయకుమార్ పాల్గొని టీటీవీ దినకరన్‌పై విమర్శలు చేశారు. దీంతో టీటీవీ అనుచరులు అన్నాడీఎంకే కార్యకర్తలపై దాడి చేయడంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఆ హిజ్రాపై చర్యలు తీసుకోండి

కమిషనర్‌కు హిజ్రాల ఫిర్యాదు ● పోలీసుల భారీ బందోబస్తు

అడయార్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ వర్గానికి చెందిన ఒక హిజ్రా తమపై చేస్తున్న అసత్య ప్రచారం కారణంగా మానసిక క్షోభకు గురవుతున్నామని, ఆ హిజ్రాపై చర్యలు తీసుకోవాలని పలువురు హిజ్రాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం వెప్పేరిలోని పోలీస్ కమిషనరేట్‌కు తరలివచ్చి తమను దూషిస్తున్న హిజ్రాపై ఫిర్యాదు చేశారు. ఒక్కసారిగా 300 మందికిపైగా హిజ్రాలు పోలీస్ కమిషనర్ కార్యాలయానికి తరలిరావడంతో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

మద్యం మత్తులో లైంగిక వేధింపులు

● వ్యాయామ ఉపాధ్యాయుడి అరెస్ట్

వేళచ్చేరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలస్థాయి క్రీడా పోటీలకు తీసుకెళ్లిన విద్యార్థినులపై వ్యాయామ ఉపాధ్యాయుడు మద్యం మత్తులో లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన తూత్తుకుడి జిల్లాలో చోటుచేసుకుంది. తిరుచెందూర్ తాలూకాలోని ప్రైవేటు పాఠశాలలో ఓ వ్యక్తి వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో, మండలస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులను తీసుకెళ్లిన అతడు మద్యం సేవించి వారిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఈ విషయాన్ని బాధితులు తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు సోమవారం ఉదయం పాఠశాలను ముట్టడించి ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని విచారణ చేపట్టి, కోవైలో ఉన్న వ్యాయామ ఉపాధ్యాయుడిని అరెస్ట్ చేసి తిరుచెందూర్‌కు తీసుకొచ్చి విచారణ చేపట్టారు.

స్తంభించిన టీవీకే సభ్యత్వ యాప్

అడయార్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) సభ్యత్వ నమోదు జోరుగా సాగుతుంది. దీంతో సభ్యత్వ నమోదు కోసం రూపొందించిన యాప్ స్తంభించిపోయింది. విల్లుపురంలో జరిగిన టీవీకే తొలి మహానాడు తర్వాత ఆ పార్టీలో చేరేందుకు యువతతో పాటు ఇతర పార్టీల కార్యకర్తలు అమితాసక్తి కనబరుస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టీవీకే నిర్వాహకులు ఈ యాప్ ఓపెన్ చేసేందుకు ప్రయత్నించడంతో యాప్ స్తంభించిపోతుంది. దీనిపై ఆ పార్టీ నిర్వాహకుడు ఒకరు మాట్లాడుతూ, ఒకే సమయంలో అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదుకు ప్రయత్నించడంతో సర్వర్ మొరాయించి ఈ పరిస్థితి ఉత్పన్నమైందని, దీన్ని వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు.

గుడియాత్తంలో రేషన్ గ్రీవెన్స్

వేలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తం సమీపం ముక్కన్‌డ్రమ్‌లో సోమవారం రేషన్ గ్రీవెన్స్ జరిగింది. డివిజన్ పౌరసరఫరాల శాఖ అధికారులు ముకిలన్, శ్రీధర్ పాల్గొని, ప్రజల నుంచి రేషన్ కార్డులకు సంబంధించిన వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో పంచాయతి అధ్యక్షుడు గంగారామ్, ఉపాధ్యక్షుడు ఏకరాజ్, గ్రామ నిర్వహణ అధికారి, గ్రామ అసిస్టెంట్ పాల్గొన్నారు.



మలయాళ చిత్రాలకు సంగీతం సమకూరుస్తా

● ఇళయరాజా

మాలీవుడ్ నుంచి ఆహ్వానం వస్తే మలయాళ సినిమాలకు సంగీతం సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు 'ఇసైజ్ఞాని' ఇళయరాజా వెల్లడించారు. యూఏఈలో 43వ షార్జా అంతర్జాతీయ పుస్తక ప్రదర్శన జరుగుతోంది. ఇక్కడ 'ప్రసిద్ధ సంగీత కళాకారుడు ఇళయరాజా సంగీత ప్రయాణం' అనే పేరుతో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇళయరాజా మాట్లాడుతూ, 'మలయాళ సినిమాలకు సంగీతం సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నాను. కేరళ రాష్ట్రంలో ప్రతి ఇంటిలో ఒక్కో సంగీత దర్శకుడున్నారు. అందువల్లే నన్ను సంగీతం సమకూర్చేందుకు ఆహ్వానించలేదని భావిస్తున్నాను. ఆ చిత్ర పరిశ్రమ నుంచి ఆహ్వానం వస్తే మాత్రం మలయాళ చిత్రాలకు సంగీతం అందించేందుకు సిద్ధంగా ఉన్నాను' అని స్పష్టం చేశారు. కాగా, ఎనిమిది పదుల వయసులో కూడా ఇళయరాజా యువ సంగీత దర్శకులతో పోటీ పడుతూ సినిమాలకు సంగీత స్వరాలు సమకూర్చుతున్న విషయం తెల్సిందే.

'డ్రాగన్'లో ముగ్గురు దర్శకులు

చిత్రజ్యోతి

'ఓ మై కడవులే' ఫేం అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' చిత్రంలో ముగ్గురు సీనియర్ దర్శకులు నటించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏజీఎస్ పతాకంపై నిర్మాతలు కల్పాతి అఘోరం, కల్పాతి ఎస్.గణేష్, కల్పాత్తి సురేష్ సమర్పణలో క్రియేటివ్ ప్రొడ్యూసర్ అర్చన కల్పాత్తి నిర్మించే ఈ చిత్రంలో గౌతం వాసుదేవ్ మేనన్, మిష్కిన్, కేఎస్ రవికుమార్ కీలక పాత్రలు పోషించనున్నారని నిర్మాణ సంస్థ ప్రకటించింది. ప్రదీప్ రంగనాథన్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించే ఈ చిత్రంలో 'మయిల్‌వాహనన్' అనే పాత్రలో మిష్కిన్, 'వాలే కుమార్' పాత్రలో గౌతం మేనన్, 'పరశురామ్' పాత్రలో కేఎస్ రవికుమార్ నటించనున్నారు. ఈ



గౌతం మేనన్, మిష్కిన్, కేఎస్ రవికుమార్

చిత్రంలోకి ముగ్గురు దర్శకులను తీసుకోవడంపై దర్శకుడు అశ్వత్ మారిముత్తు తన ఆనందాన్ని వ్యక్తంచేశారు. 'ఈ ముగ్గురు దర్శకులు మా చిత్రం కోసం నటులుగా మారడం ఎంతో బలాన్నిస్తుంది. ఇప్పటికే ఈ ముగ్గురి ఫస్ట్‌లుక్ కూడా రిలీజ్ చేయగా, వాటికి మంచి స్పందన వచ్చింది' అని పేర్కొన్నారు. కాగా, 'లవ్‌టుడే' వంటి సూపర్‌హిట్ మూవీ తర్వాత ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించే చిత్రం కావడం, ఇందులో ముగ్గురు సీనియర్ దర్శకులు నటిస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి.



మేజర్ 'ముకుంద్'కు నివాళులర్పించి..
'అమరన్' తిలకించిన పంచగ్రామాల ప్రజలు

అడయార్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా రాజపాళెయం సమీపంలోని ఐదు గ్రామాల ప్రజలు మేజర్ ముకుంద్ వరదరాజన్ చిత్రపటానికి నివాళులర్పించి, ఆ తర్వాత శివకార్తికేయన్ నటించిన 'అమరన్' చిత్రాన్ని వీక్షించారు. ఈ గ్రామ ప్రజల కోసం నిర్మాణ సంస్థలు ఉచితంగా సినిమా చూసే అవకాశాన్ని కల్పించారు. రాజపాళయం సమీపంలో పెరుమాళ్‌దేవన్‌పట్టి, మీనాక్షిపురం, చొక్కలింగపురం, రామలింగపురం, తులుక్కన్‌కుళం అనే పంచ గ్రామాలను ఆర్మీ గ్రామాలుగా పిలుస్తుంటారు. దీనికి కారణం లేకపోలేదు. స్వాతంత్ర్య పోరాటం కాలంలో ఇంటికి ఒకరిని చొప్పున భారత సైన్యానికి పంపించారు. ఈ కారణంగా ఈ గ్రామాలను సైనిక గ్రామాలుగా పిలుస్తారు. ఈ నేపథ్యంలో మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన 'అమరన్' చిత్రాన్ని ఈ గ్రామ ప్రజలకు నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిలిమ్స్ ఉచితంగా చూసే అవకాశం కల్పించింది. ఈ సినిమాను చూసేందుకు వచ్చిన సైనిక గ్రామాల ప్రజలందరూ ముకుంద్ చిత్రపటానికి నివాళులర్పించి, ఆ తర్వాత థియేటర్‌లో సినిమా చూశారు. ఈ సందర్భంగా వారు అగ్ర నటుడు కమల్ హాసన్‌కు ధన్యవాదాలు తెలిపారు.



ముకుంద్ చిత్రపటానికి ఆర్మీ గ్రామ ప్రజల నివాళులు

అవకాశాల కోసం
లాబీయింగ్ చేయను

● రెజీనా

అగ్రహీరో అజిత్ 'విడా ముయర్చి' చిత్రంలో నటిస్తున్న హీరోయిన్ రెజీనా కసాండ్రా సినిమాల్లో అవకాశాల కోసం లాబీయింగ్ చేయనని స్పష్టం చేశారు. దక్షిణాదిలో సినిమా అవకాశాలు చేజిక్కించుకోవడం సులభమని, కానీ, బాలీవుడ్‌లో అలాంటి పరిస్థితి లేదనే విషయాన్ని స్వీయ అనుభవంతో చెబుతున్నానని వెల్లడించారు. తాజాగా ఆమె ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ. 'దక్షిణ భారత చిత్రపరిశ్రమ నుంచి బాలీవుడ్‌కు వెళ్ళే నటీనటులకు భాష ప్రధాన సమస్యగా ఉంది. ఈ విషయంలో బాలీవుడ్ టెక్నీషియన్లు ఏమాత్రం రాజీపడరు. కానీ, బాలీవుడ్ నుంచి దక్షిణాదికి వచ్చే నటీనటులకు ఎలాంటి సమస్యా లేదు. పైగా అవకాశాలు కూడా బాగానే వస్తున్నాయి. బాలీవుడ్ చిత్రాల్లో నటించేందుకు నేను ఎంతో ప్రయత్నించగా, నెట్‌వర్క్ మీటింగుల్లో పాల్గొనాలని సూచించారు. దీంతో కొన్ని సమావేశాల్లో కూడా పాల్గొన్నాను. కానీ, దక్షిణాదిలో అలాంటి పరిస్థితి లేదు. మేనేజర్లు లేదా సినిమా పీఆర్వోలు అన్ని విషయాలు చూసుకుంటారు. ఇపుడు దక్షిణాదిలో కూడా మేనేజ్‌మెంట్ నెట్‌వర్క్ ప్రవేశించింది. హిందీలో పోటీతత్వం ఎక్కువ. అవకాశాల కోసం నన్ను నేను పణంగా పెట్టుకునేందుకు సిద్ధంగా లేను. అలాగే లాబీయింగ్ కూడా చేయను. అవకాశాల కోసం ఇతర హీరోయిన్లతో పోటీ పడటం లేదనే విమర్శ నాపై ఉంది. ఇది పూర్తిగా అబద్ధం. బాలీవుడ్‌తో పాటు ఇతర భాషల్లో అవకాశాలు చూసుకునేందుకు ఒక కమిటీ ఉంది. నేను కేవలం ఆడిషన్స్‌కు మాత్రమే హాజరవుతున్నా' అని పేర్కొన్నారు.

రైల్వే చరిత్రలో నూతనాధ్యాయం.. ఇదొక ఇంజనీరింగ్ అద్భుతం.. మండపం.. రామేశ్వరం ద్వీపాన్ని కలుపుతూ సముద్రంలో అధునాతన పద్ధతుల్లో నిర్మించిన వంతెన నవశకాన్ని తీసుకురానుంది. దేశంలోనే తొలి రైల్వే లైన్ వర్టికల్ లిఫ్ట్ బ్రిడ్జిగా చరిత్రలో నిలిచిపోనుంది. దాదాపు రూ.535 కోట్లతో నిర్మించిన ఈ నూతన వంతెనపై త్వరలో రైళ్లు పరుగులు తీయనున్నాయి.

వంతెన నిర్మాణంలో నవశకం
'పాంబన్' ప్రత్యేకం

● దేశంలోనే తొలి రైల్వే లైన్ వర్టికల్ లిఫ్ట్ బ్రిడ్జి సిద్ధం
● ప్రారంభోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు



కొత్తగా నిర్మించిన పాంబన్ వంతెన

రాష్ట్రంలో ఆగ్నేయ బంగాళాఖాతంలోని పాక్ జలసంధి ప్రాంతంలో రామేశ్వరం జిల్లాలో మండపం - రామేశ్వరం ద్వీపాన్ని కలుపుతూ 1914లో పాంబన్ వంతెన నిర్మించారు. ఈ పాత బ్రిడ్జి స్థానంలో ఇప్పుడు సరికొత్త హంగులతో నూతన వంతెన నిర్మించారు. సముద్రపు కెరటాలు, భారీ గాలుల్ని తట్టుకునేలా, భవిష్యత్ అవసరాల కోసం బ్రిడ్జిపై రెండో రైల్వే లైన్ నిర్మాణం చేపట్టేందుకు అనువుగా ఈ వంతెన నిర్మాణం సాగింది. ముఖ్యంగా సముద్రమార్గంలో నౌకలు, క్రూయిజ్ వంటి భారీ షిప్‌లు వచ్చినపుడు ఈ వంతెన (రైల్వే లైనును) పైకి లిఫ్ట్ చేస్తారు. ఈ తరహా వంతెన దేశంలో నిర్మించడం ఇదే తొలిసారి. బ్రిటిష్ పాలనలో కేవలం రూ.20 లక్షలతో 2.5 కిలోమీటర్ల పొడవున పాంబన్ వంతెన నిర్మాణం పూర్తి చేయగా, ఇపుడు ఈ కొత్త వంతెనను రూ.535 కోట్లతో పూర్తి చేశారు. ఈ వంతెనపై ఇటీవలే 80 నుంచి వంద కిలోమీటర్ల వేగంతో ట్రయల్ రన్‌ను కూడా విజయవంతంగా పూర్తి చేయగా, ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

దేశ చరిత్రలో ప్రత్యేక స్థానం...

1914లో బ్రిటీష్ పాలకులు నిర్మించిన ఈ వంతెనకు దేశ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంది. మొదట మీటర్ గేజ్ నిర్మాణం పూర్తి చేయగా, 2006-07లో బ్రాడ్ గేజ్‌గా మార్చారు. పాత బ్రిడ్జి మధ్య నుంచి పడవలు, షిప్‌లు వెళ్ళాంటే 16 మంది కార్మికులు పనిచేస్తేనే బ్రిడ్జి తెరుచుకునేది. ఇపుడు అలాకాకుండా, ఏకంగా రైల్వే ట్రాక్ ఉన్న వంతెన పూర్తిగా పైకి లేచేలా అదునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తి చేశారు. రైల్వే చరిత్రలో ఇదొక ఇంజనీరింగ్ అద్భుతమని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. 2019 మార్చి 1న ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేయగా, ఆగస్టు 11వ తేదీ జరిగిన భూమి పూజతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.



విద్యుద్దీప కాంతుల్లో ప్రకాశిస్తూ..



పాత, కొత్త వంతెనలు

2023 నుంచి రాకపోకలు బంద్...

పాత పాంబన్ వంతెనపై 2023 నుంచి రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. దాదాపు 110 యేళ్ళ చరిత్ర కలిగిన పాత వంతెన బలహీనపడటం, పలు ప్రాంతాల్లో బీటలు కనిపించాయి. నౌకలు దాటే ప్రాంతంలో లిఫ్ట్ యంత్రాలు పదేపదే మొరాయించడం, ఇనుప గడ్డర్లు కాంక్రీట్‌లు శిథిలావస్థకు చేరుకోవడం, వంతెన వద్ద సెన్సార్ల పనితీరు ఆశాజనకంగా లేకపోవడం వంటి లోపాలను ఇంజనీర్లు గుర్తించారు. దీంతో ఈ పాత వంతెనకు సమీపంలోనే కొత్త వంతెన నిర్మించాలని నిర్ణయించారు. దీంతో రామేశ్వరానికి వెళ్ళే రైళ్ల రాకపోలను పూర్తిగా నిలిపివేసి మండపం, రామేశ్వరం వరకు మాత్రమే నడుపుతున్నారు.

వంతెనపై ట్రయల్ రన్



కొత్త వంతెన పొడవు ఎంతంటే..?

కొత్తగా నిర్మించిన వంతెన పొడవు 2.7 కి.మీ. ఇందుకోసం సముద్రంలో 333 కాంక్రీట్ పునాదులు, 101 దిమ్మెలపై నిర్మాణం చేపట్టారు. ఒక్కో దిమ్మె 18.3 మీటర్లు ఉండేలా, దానిపై రైల్వే ట్రాక్ వచ్చేలా డిజైన్ చేశారు. రైల్వే లైను లిఫ్ట్ చేసేందుకు పూర్తి స్టెయిన్‌లెస్ స్టీల్ ఉపయోగించారు. ఈ లిఫ్టు 63 మీటర్ల పొడవు, 72.5 మీటర్ల ఎత్తు ఉండేలా నిర్మించారు. పాత వంతెన కంటే కొత్త వంతెన అదనంగా ఒక మీటరు ఎత్తులో ఉంటుంది. అలాగే, ఈ వంతెన నిర్మాణం కోసం కాంక్రీట్ పునాదులు తుప్పు పట్టకుండా సముద్రంలోకి 35 మీటర్ల మేరకు బోర్‌వేసి, తుప్పుపట్టని విధంగా నిర్మాణం చేపట్టినట్టు రైల్ వికాస్ నిగమ్ సంస్థ తెలిపింది. ముంబైలోని బాంద్రా-వర్లీ ప్రాంతాల మధ్య సముద్ర ఉపరితలంపై నిర్మించిన సీ లింక్ బ్రిడ్జి నిర్మించకముందు దేశంలోనే అతిపొడవైన వంతెనగా పాంబన్ బ్రిడ్జికి గుర్తింపు ఉండేది. ఇపుడు బాంద్రా - వర్లీ బ్రిడ్జి దేశంలోనే అతిపొడవైన వంతెన కాగా, పాంబన్ వంతెన రెండో స్థానానికి పడిపోయింది.

ఈ వంతెన ప్రత్యేకతలేంటి?

వంతెనపై భవిష్యత్ అవసరాలకు డబ్లింగ్ చేపట్టేలా మరో ట్రాక్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని విడిచిపెట్టారు. ప్రస్తుతం ఓ ట్రాక్ మాత్రమే పూర్తి చేశారు. రైల్వే ఇంటర్‌లాకింగ్ వ్యవస్థతోపాటు ట్రైన్ కంట్రోల్ సిస్టం అనుసంధానించారు. త్వరలోనే మార్గాన్ని విద్యుద్దీకరించనున్నారు. క్రూయిజ్, షిప్‌లు సులువుగా దాటి వెళ్ళేలా లిఫ్టులు అమర్చారు. ఇవి రిమోట్ కంట్రోల్‌తో పనిచేయనున్నారు.

- అడయార్, ఆంధ్రజ్యోతి

బ్యాడ్మింటన్ సింగిల్స్ విజేత రుత్విక్

వేళచ్చేరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎండీసీ తెలంగాణ ఇంటర్నేషనల్ ఛాలెంజ్ బ్యాడ్మింటన్ మెన్స్ సింగిల్స్ విజేతగా రాష్ట్ర క్రీడాకారుడు రిత్విక్ సంజీవి నిలిచారు. ఆదివారం జరిగిన ఈ టోర్నీ పురుషుల విభాగంలో స్వర్ణ పతకం సాధించిన రిత్విక్‌ను హట్సన్ బ్యాడ్మింటన్ సెంటర్ హెడ్ కోచ్ రజనీకాంత్, హట్సన్ ఆగ్రో ప్రొడక్ట్ ఛైర్మన్ ఆర్‌జీ చంద్రమోహన్ తదితరులు అభినందించారు. ఈ మేరకు హట్సన్ బ్యాడ్మింటన్ సెంటర్ ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ.. రిత్విక్ వంటి యువ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించడం తమిళనాడులో క్రీడా ప్రతిభ పెంపొందించుకోవాలనే తమ నిబద్ధతను తెలియజేస్తోందన్నారు. హట్సన్ బ్యాడ్మింటన్ సెంటర్ కొత్త శిఖరాలకు చేరుకోవడానికి వనరులు, మార్గదర్శకాలను అందించడం ద్వారా ఛాంపియన్‌లను అభివృద్ధి చేయాలనే దృక్పథంతో స్థాపించబడిందని వివరించారు.



రిత్విక్ సంజీవి

డిసెంబరు 29న నల్లకన్ను వందో జన్మదినం

ప్యారీస్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నేత ఆర్.నల్లకన్ను 100వ జన్మదిన వేడుకలు డిసెంబరు 29న జరుగనున్నాయి. ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీ ఛైర్మన్‌గా నియమించబడిన ప్రపంచ తమిళుల సమాఖ్య వ్యవస్థాపకులు పల.నెడుమారన్, కమిటీ నిర్వాహకులు మణివన్నన్ సోమవారం ఉదయం సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకున్నారు. నల్లకన్ను జన్మదిన వేడుకలు ప్రారంభించాలని ఈ సందర్భంగా వారు సీఎంను ఆహ్వానించారు.



ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి నల్లకన్ను జన్మదిన వేడుకల ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నెడుమారన్, మణివన్నన్

బ్రాడ్‌వేలో రూ.822.70 కోట్లతో బస్ టెర్మినల్

● మంత్రి పీకే శేఖర్‌బాబు

ప్యారీస్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మద్రాసు హైకోర్టు సమీపంలోని బ్రాడ్‌వే ప్రాంతంలో రూ.822.70 కోట్లతో కొత్త బస్ స్టేషన్ నిర్మించనున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు వెల్లడించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే మేనిఫెస్టోలో, ప్రస్తుత బ్రాడ్ వే బస్టాండ్‌ను ఆధునిక వసతులతో పునర్నిర్మిస్తామని ప్రకటించారు. ఆ మేరకు కొత్త బస్ టెర్మినల్ నిర్మించనున్న బ్రాడ్‌వే బస్టాండ్‌ను సోమవారం మంత్రి శేఖర్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాల మేరకు సీఎంఆర్‌ఎల్, రాష్ట్ర ప్రభుత్వం, డూపిక్కో, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ నిధుల సహకారంతో కొత్త బస్ టెర్మినల్ నిర్మాణాలకు త్వరలోనే శంకుస్థాపన చేపట్టనున్నట్లు తెలిపారు. అదే విధంగా, బస్టాండ్ పక్కనే ఉన్న 'కుర్లగం' భవనం కూల్చివేసి 8 అంతస్తుల బస్ స్టేషన్, వాణిజ్య కాంప్లెక్స్ తదితరాలను నిర్మించనున్నట్లు వివరించారు. తాను ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న హార్బర్ నియోజకవర్గంలో 1,500 గృహాల నిర్మాణానికి డిసెంబరు 14న సీఎం శంకుస్థాపన చేస్తారని మంత్రి శేఖర్‌బాబు తెలిపారు. మంత్రితో పాటు జీసీసీ కమిషనర్ కుమరగురుపరన్, ప్రభుత్వ ఉన్నతాధికారులున్నారు.



బస్ టెర్మినల్ డిజైన్ పరిశీలిస్తున్న మంత్రి శేఖర్‌బాబు



ఆకట్టుకుంటున్న కుడ్య చిత్రాలు

కుంచె నుంచి జాలువారిన ప్రాణం...
చెన్నై ఎగ్మూర్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఫ్లై ఓవర్‌పై ముచ్చటగొలుపుతున్న పెయింటింగ్‌లు



స్టాలిన్... వేలం పాటలో ఎన్నుకున్న సీఎం కాదు

● మంత్రి పీకే శేఖర్‌బాబు ధ్వజం

అడయార్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూవత్తూరులోని ఓ రిసార్టులో జరిగిన వేలం పాటలో ఎన్నికైన సీఎం తమ నేత స్టాలిన్ కాదని, ఇలాంటి విమర్శలు చేస్తే ఎలాంటి చర్చకైనా తాము సిద్ధమని దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్ బాబు అన్నాడీఎంకే అధినేత ఈపీఎస్‌ను పరోక్షంగా హెచ్చరించారు. సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులు, ఆలయ జీర్ణోద్ధారణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చెన్నై ఓటర్లు ప్రత్యక్షంగా ఎన్నుకున్న మేయర్ ఎవరైనా ఉన్నారంటే అది ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ మాత్రమేనని గుర్తు చేశారు. వర్షాకాలంలో ఇంట్లో పడుకోవడం లేదన్నారు. చినుకు పడకముందే క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, చర్యలు తీసుకునే సీఎం స్టాలిన్ మాత్రమేనన్నారు. గతంలో ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు అంటేనే స్వలాభం కోసం అమలు చేసేవనే పేరుందన్నారు. కానీ, ఇపుడు అమలు చేస్తున్న పథకాలన్నీ ప్రజలకు లబ్ధి చేకూరేవన్నారు. దాదాపు 56 యేళ్ళుగా ప్రజాసేవకు అంకితమయ్యారని, కఠోర మీసా చట్టాన్ని కూడా ఎదుర్కొన్నారని, ఇప్పటివరకు 18 సార్లు జైలుకు వెళ్ళారని, కానీ, ఒక్కసారి కూడా అవినీతి కేసులో సీఎం స్టాలిన్ జైలుకు వెళ్ళలేదని, ప్రజల కోసం, ప్రజా సంక్షేమం కోసం జరిపిన పోరాటాల్లోనే జైలుకు వెళ్ళారన్నారు. తన ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు నేలపై పాకుతూ వంగి వంగి వెళ్ళిన వ్యక్తి కాదని, 2021లో ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజలచే ఎన్నుకోబడిన ముఖ్యమంత్రి స్టాలిన్ అని అన్నారు. ఇలాంటి విమర్శలు చేస్తే ఎలాంటి చర్చలకైనా తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రకటించారు.

పెరియార్ ఆలయంలో అమెరికన్ల పూజలు

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన భక్తులు మహాబలిపురంలోని తలశయన పెరుమాళ్ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నుదుట విభూది, కుంకుమ దిద్దుకొని, మెడలో మాలధారణతో ప్రపంచ శాంతి కోరుతూ చేపట్టిన యాగంలో పాల్గొన్నారు. రెండు గంటల పాటు సాగిన ఈ యాగం అనంతరం హారతి కళ్ళకద్దుకున్నారు. ఆలయ నిర్వాహకులు వారికి ప్రసాదాలు అందజేశారు.



ప్రత్యేక పూజల్లో అమెరికన్లు



సముద్రపు కాకుల సందడి







తిరుపతి జిల్లా వాకాడు సమీపంలోని కొండూరుపాళెం ప్రాంతంలో సీగల్స్, పెయింటెడ్ స్టార్క్స్ సందడి చేస్తున్నాయి. చలికాలం మొదలవగానే విదేశాల నుంచి ఈ విహంగాలు వచ్చి దిగాయి. చిన్న చేపలూ, రొయ్యలూ, ఎండ్రకాయలూ వేటాడే ఈ పక్షులను సముద్రపు కాకి, కాస్పియన్ టెర్న్ అని కూడా అంటారు. పరిణామంలో చిన్నదైనా చాలా ఎత్తుకి ఎగురుతూ వేగంగా కిందకి దూసుకు వస్తుంది. ఇవి గుంపులుగానే కనిపిస్తుంటాయి. సమూహాలుగా దేశాలు దాటి ప్రయాణిస్తాయి. పెయింటెడ్ స్టార్క్ (ఎర్రకాళ్ల కొంగ) వెదురు పట్టులో చింత చెట్లమీద ఆవాసాలను ఏర్పాటు చేసుకుంటుంది. సముద్రపు కాకులు నేలపట్టులో కనిపించవు. పులికాట్‌లో అక్కడక్కడా తారసపడుతాయి.



కాకినాడ్ హోప్ ఐలెండ్స్‌లోనూ ఇవి ఇదే కాలంలో కనిపిస్తాయి. అయితే వీటి సంఖ్య అక్కడ 200 కి మించి ఉండదని అంటారు. కొండూరుపాళెం, తూపిలిపాళెం ఉప్పుటేరులో మాత్రం వందలాదిగా సముద్రకాకులు సందడి చేస్తున్నాయి.

-వాకాడు,ఆంధ్రజ్యోతి

శైవక్షేత్రాల్లో దీపకాంతులు

కార్తీక మాసం రెండో శుక్రవారం. సాయం సంధ్యవేళ శైవక్షేత్రాల్లో భక్తులు నేతి దీపాలు వెలిగించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ వైష్ణవ పుష్కరిణిలో లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. తిరుపతిలోని కపిలతీర్థంలో మహిళా భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.







వెలుగులీనుతున్న శ్రీకాళహస్తిలోని వైష్ణవ కోనేరు



కపిలతీర్థంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు ←

సమస్య మొదటికే..!

● మళ్లీ సెల్ టవర్ ఎక్కిన దళిత రైతులు



కేవీబీపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అధికారులు మాట తప్పారంటూ కళత్తూరు దళిత రైతులు మళ్లీ సెల్ టవరెక్కారు. సమస్య పరిష్కారమయ్యే వరకు కిందకు దిగమంటూ సోమవారం సాయంత్రం భీష్మించారు. కళత్తూరు రెవెన్యూ బ్లాక్ నెం.4లోని భూములకు రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చారు. ఆ భూములు తమవంటూ అటవీశాఖ అడ్డంకులు కల్పిస్తోందంటూ శనివారం ఉదయం ఈ రైతులు సెల్ టవర్ ఎక్కిన విషయం తెలిసిందే. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు మునిరత్నంరెడ్డి, ఎఫ్ఆర్వో రాధికారెడ్డి తదితరులు సమస్యను వంద రోజుల్లో పరిష్కస్తామని హామీ ఇవ్వడంతో దిగొచ్చారు. కాగా, ఆదివారం భూముల వద్ద వెళ్తున్న తమను అటవీశాఖ అధికారులు అడ్డగించారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం తిరిగి భూముల వద్దకు వెళ్లితే ఎఫ్ఆర్వో మాధవిరెడ్డి అడ్డుకోవడంతో పాటు దుర్భాషలాడారన్నారు. వీరి తీరుకు నిరసనగా సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో పురుగులమందు డబ్బాలతో టవర్‌పైకి ఎక్కారు. సమస్య పరిష్కారమయ్యే దిగేది లేదన్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వారికి నచ్చజెప్పినా రైతులు పట్టించుకోలేదు. సమయం ఇస్తే సమస్యను పరిష్కరిస్తామని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, పుత్తూరు డీఎస్పీ రవికుమార్ కళత్తూరు దళిత రైతులతో చెప్పారు. సోమవారం రాత్రి 9 గంటలకు వీరు రైతులతో చర్చించారు. రైతులు మాత్రం ససేమిరా అన్నారు. ఇంతలో నలుగురు మహిళలు ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. పోలీసులు వెంటనే స్పందించి ప్రమాదం జరగకుండా కాపాడారు. తమ సమస్య పరిష్కారం అయ్యే వరకు టవర్ దిగేది లేదని రైతులు తెగేసి చెప్పారు. దీంతో వచ్చిన అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

బడ్జెట్‌పై నేతల మాట

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి పెద్దపీట వేసేలా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టింది. అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత ఎన్డీఏ కూటమికే చెల్లింది.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే

ఆశాజనకంగా లేదు

బడ్జెట్‌లో రైతులకు, నిరుద్యోగ భృతి, ఎస్సీలకు మేలు చేసేలా ఆశించినంత లేదు. హడ్కో రుణాలను చక్రవడ్డీలతో తీసుకురావడం ఏమిటో అర్థం కావడంలేదు. అప్పులు తీసుకురావడంలో గత ప్రభుత్వంతో పోటీ పడుతున్నట్లుంది.

- డాక్టర్ చింతా మోహన్, కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత

వెనుకబడిన వర్గాల సంక్షేమమే లక్ష్యం

వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం రూ3097కోట్లు కేటాయించడం అభినందించదగ్గ విషయం. టీడీపీ తొలినుంచీ వెనుకబడిన వర్గాలకు బడ్జెట్లో అగ్రస్థానం కల్పిస్తోంది. ఇప్పుడూ బీసీలకు వెన్నుదన్నుగా బడ్జెట్‌లో ప్రతిపాదనలు పెట్టడం హర్షదాయకం.

- నరసింహ యాదవ్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్

ఏపీ భవిష్యత్తు మారబోతోంది

బడ్జెట్‌లో ప్రజా శ్రేయస్సు, సర్వతోముఖాభివృద్ధితో పాటు దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యంగా కనిపిస్తోంది. మహిళలు, నిరుద్యోగులు చిన్న చిన్న కుటీర పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలను మంజూరుకు పెద్దపీట వేయడం హర్షణీయం. గత ఐదేళ్లుగా అధోగతిలోకి వెళ్లిపోయిన ఏపీ భవిష్యత్తు కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో మారబోతోంది.

- భానుప్రకాష్ రెడ్డి, టీటీడీ సభ్యుడు

వేతన జీవులగురించి పట్టించుకోలేదు

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు,వారి ఉద్యోగ భద్రత గురించి ప్రస్తావన లేదు. ఇది బాధాకరం.

- కందారపు మురళి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎన్నికల హామీలపై ప్రకటన ఏది?

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు ఎప్పటి నుంచి అమలు చేస్తారన్న విషయాన్ని బడ్జెట్‌లో పొందుపరచలేదు. దీంతో ప్రజల్లో హామీల విషయమై స్పష్టత లేకుండా పోయింది.

- వి.నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి

పాజెక్టులకు మొండి చేయి

రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంపై ప్రస్తావించలేదు. రైతు సంక్షేమంపై స్పష్టత ఇవ్వలేదు. ట్రూఅప్ చార్జీలు తగ్గిస్తామని ఇచ్చిన హామీపై ప్రకటన లేదు.

- ఎ.రామానాయుడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

యువతకు పెద్దపీట

ఉన్నత విద్యకు రూ.2,326 కోట్లు కేటాయించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు రూ.1,215 కోట్లు వెచ్చించనున్నారు. యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖలకు రూ.322 కోట్లు కేటాయించడంతో పాటు ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా కింద 3 శాతం రిజర్వేషన్ కల్పించడం బాగుంది. యువతకు పెద్దపీట వేసినట్టు కనిపిస్తోంది.

- డాక్టర్ కొండేటి సునీత, ఎకనమెట్రిక్స్ డిపార్ట్‌మెంట్, ఎస్వీయూ

అన్ని రంగాలకూ సమ ప్రాధాన్యం

పరిశ్రమలు, వాణిజ్య రంగాలకు రూ.3,127 కోట్లు కేటాయించడం గొప్ప విషయం. పంచాయతీ ప్రధాన రంగాలకు ఆశాజనకమైన కేటాయింపులు జరిగాయి. బడ్జెట్‌లో అన్ని రంగాలకు సమ ప్రాధాన్యం ఇవ్వడం సంతోషదాయకం.

- మోహన్‌కుమార్‌రాజు, తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నేర ప్రవృత్తికి దూరంగా ఉండండి

● యువతకు ఎస్పీ హితబోధ

● పద్మావతి వర్సిటీలో అవగాహనా కార్యక్రమానికి విశేష స్పందన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేర ప్రవృత్తికి దూరంగా ఉంటూ, ఉన్నత భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని యువతకు ఎస్పీ సుబ్బరాయుడు హితబోధ చేశారు. సైబర్, డ్రగ్స్ నేరాలు, చిన్నారులు, మహిళలపై హింసకు వ్యతిరేకంగా పద్మావతి మహిళా యూనివర్సిటీ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. తమలోని ప్రతిభ, సృజనాత్మక ఆలోచనలను దేశ.. వ్యక్తిగత భవిష్యత్తు కోసం ఉపయోగించాలని కోరారు. చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు, హింసకు పాల్పడుతున్న వారిపై కఠిన శిక్షలు తీసుకుంటున్నామని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు బానిస కావద్దని, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిస్తే 100, 112 కు సమాచారం అందించాలన్నారు. అలాంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సైబర్ క్రైం బాధితులు 1930 టోల్ ఫ్రీ నెంబరుకు లేదా సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. చిన్న వయసులోనే పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వడం వల్ల తెలియక అనేక యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం ద్వారా పలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సైబర్ క్రైం బాధితుల్లో డిగ్రీ లోపు యువత ఎక్కువగా ఉన్నారని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. చిన్నారులపై అత్యాచార ఘటనల్లో ఎక్కువగా పక్కింటి వారు, తెలిసిన వారే బాధ్యులుగా ఉంటున్నారన్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. గంజాయి సరఫరాకు కాలేజీలను అడ్డాగా మార్చుకొని అక్రమ దందా సాగిస్తున్నారన్నారు. మత్తు పదార్థాల నివారణకు విద్యార్థులు, అధ్యాపకుల సహకారం ప్రభుత్వానికి అవసరమన్నారు. మొబైల్ ఫోన్లకు వచ్చే ఓటీపీల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని పద్మావతి వర్సిటీ వీసీ ఉమ అభిప్రాయపడ్డారు. ఈ దిశగా విద్యార్థులు తమ పరసరాల్లోని వారికి అవగాహన కల్పించాలన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ తదితరులు

అర్జీలకు పరిష్కారం చూపండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం



తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చే వినతులకు త్వరగా పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయనతో పాటు జేసీ శుభం బన్సల్, రెవెన్యూ అధికారులు వినతులు స్వీకరించారు. మొత్తం 184 అర్జీలు అందగా అందులో 120 భూ సమస్యలపైనే ఉన్నాయి.

సాగుభూమిని కబ్జా చేశారు



30 ఏళ్లగా బీడు భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. 3 ఎకరాల్లో మామిడి మొక్కలు నాటి బిడ్డల్లా జాగ్రత్తగా చూశాం. రాత్రికి రాత్రే గ్రామానికి చెందిన పవన్, మరికొంత మంది మామిడి మొక్కలు నరికేయడమేగాక ఆ భూమిలో రేకుల షెడ్డు వేశారు. అడిగితే చంపేస్తామని బెదిరిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. మీరైనా న్యాయం చేయండి.

- రామకృష్ణ, బంగారెడ్డికండ్రిగ, వడమాలపేట మండలం

స్థలం కబ్జాకు ప్రయత్నం



నాకు సరిగా మాటలు రావు. పైగా వికలాంగురాలిని.తండ్రి నాగయ్య వద్ద ఉంటున్నా. నా కోసం 26ఏళ్ల క్రితం ఇంటి పక్కనే కొంత స్థలాన్ని మా తండ్రి కొనిచ్చాడు.ఆ స్థలం తమదంటూ కొంతమంది గతంలో ఇబ్బందిపెట్టారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కొంతకాలం ఊరుకున్నారు. మళ్లీ వచ్చి స్థలం కబ్జాకు ప్రయత్నిస్తున్నారు. పోలీసులకు, కలెక్టరేట్‌లో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. న్యాయం చేయండి.

- జెస్సీ, వేంబాకం హరిజనవాడ, నాగలాపురం

జీవనోపాధి కల్పించకపోతే ఆత్మహత్యే శరణ్యం



గతంలో విజయవాడలో ఓ ప్రైవేటు కంపెనీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేశా. రోడ్డు ప్రమాదంలో కాళ్లు, చేతులు విరిగి మంచానపడ్డాను. నడవడానికి ఇబ్బందిగా ఉంది. ఏదైనా ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని అధికారులను వేడుకుంటున్నా. ముగ్గురు కలెక్టర్లు మారినా ఏ ఒక్కరూ ఉపాధి కల్పించలేదు. ఇలాగైతే ఆత్మహత్యే శరణ్యం.

- మురళి, ముత్యాలమ్మ గుడివీధి, శ్రీకాళహస్తి



పెరిగిన ఓపీ కేంద్రాల్లో ఓపీ తీసుకుంటున్న రోగులు

రుయాలో అదనపు ఓపీ కేంద్రాలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి(వైద్యం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు సులువుగా ఓపీ తీసుకునేందుకు సూపరింటెండెంట్ రవిప్రభు సోమవారం మూడు అదనపు ఓపీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతంలో కేవలం నాలుగు ఓపీ కేంద్రాలే ఉన్నాయి. దీనికితోడు ఈ-ఆస్పత్రి పేరుతో నూతన విధానాన్ని ప్రవేశ పెట్టడంతో ఓపీ తీసుకోవడం రోగులకు కష్టంగా మారింది. దీనిపై 'రుయాలో 'ఓపీ'కకు పరీక్ష' శీర్షికన ఈనెల 7న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో అధికారులు సోమవారం నుంచి అదనంగా మరో మూడు ఓపీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో 11 గంటలకే ఓపీ కేంద్రంలో అందరికీ ఓపీ అందించేందుకు వీలైంది.

టీడీఆర్ బాండ్లపై విజి'లెన్స్'

● విచారణ వేగవంతం చేసిన అధికారులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వెలుగుచూసిన ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్ల కుంభకోణంలో విచారణ వేగవంతమైంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా విజిలెన్సు విభాగం ఎస్పీ కరీముల్లా షరీఫ్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. వీరిలో విజిలెన్సు డీఈ నాగసురేష్, సీఐ చంద్రశేకర్ నాయక్, ఏఈలు సౌజన్య, రామ్మోహన్ తదితర సిబ్బంది ఉన్నారు. అభివృద్ధి పేరుతో గత వైసీపీ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రోడ్ల ముసుగులో టీడీఆర్ బాండ్ల కుంభకోణానికి పాల్పడినట్టు విమర్శలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తిరుపతితో పాటు రాష్ట్రంలోని పలు మున్సిపాల్టీల్లో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణాలపై విచారణకు ఆదేశించింది. ఈక్రమంలో తిరుపతి కార్పొరేషన్ అధికారుల నుంచి టీడీఆర్ బాండ్లకు సంబంధించిన అన్ని రికార్డులను విజిలెన్సు అధికారులు తెప్పించుకున్నారు. సోమవారం నుంచి విచారణ ప్రారంభించారు. ఆ వివరాల ప్రకారం ఒక్కో రోడ్డును పరిశీలిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్ల అవసరం ఎంత వరకు ఉందనే కోణంలో విచారిస్తున్నారు. ప్రతి రోడ్డును క్షుణంగా పరిశీలించి భూములు ఇచ్చిన వారు, బెదిరించి భూములు లాక్కున్న వారుంటే వారినుంచీ రాత పూర్వకంగా స్టేట్‌మెంట్లు తీసుకోనున్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు ప్రణాళికాబద్ధంగా వేశారా లేదా అనేదీ పరిశీలించనున్నారు. రోడ్లు వేసిన ప్రాంతంలో అప్పట్లో భూమి విలువ ఎంత అనే దానిపైనా విజిలెన్సు అధికారులు దృష్టి సారించారు. ప్రతి వ్యక్తని కలిసి విచారించి స్టేట్‌మెంట్లు నమోదు చేస్తామని డీఈ నాగసురేష్ చెప్పారు.

ఉపాధ్యాయులకు 'ఉత్తమ' అవార్డులు

● సీఎం చేతుల మీదుగా ప్రదానం

తిరుపతి(విద్య), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి 'ఉత్తమ' ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు విజయవాడలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నుంచి అవార్డులు స్వీకరించారు. అవార్డులు అందుకున్న వారిలో అత్యధికంగా తిరుపతి జిల్లా నుంచే ఎనిమిది మంది (ఒక ప్రధానోపాధ్యాయుడు, ఏడుగురు ఉపాధ్యాయులు) ఉన్నారు. ఏర్పేడు మండలం పల్లం జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు టి.ఆనంద్ ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. శ్రీకాళహస్తి మండలం జడ్పీ హైస్కూల్ సోషియల్ స్టడీస్ టీచర్ సురేష్ కునాటి, తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాలెం మండల ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ కె.బాలసుబ్రహ్మణ్యం, చంద్రగిరి మండలం రంగంపేట జడ్పీ హైస్కూల్ పీఈటీ డాక్టర్ పి.ప్రభాకర్‌రావు, ఏర్పేడు మండలం బండారుపల్లె జడ్పీ హైస్కూల్ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఎం.సుబ్రహ్మణ్యం, పిచ్చాటూరు మండలం రాజానగరం జడ్పీ హైస్కూల్ బయాలజీ ఉపాధ్యాయుడు వి.కామాక్షయ్య, దొరవారిసత్రం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) పీజీటీ బి.యామిని, కేవీబీ పురం కేజీబీవీ ఇంగ్లిష్ టీచర్ ఆర్.మంజువాణి అవార్డులు అందుకున్నారు.

మోహన్‌నాయుడికి ఉత్తమ అధ్యాపక అవార్డు

తిరుపతిరూరల్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వ్యవసాయ కళాశాల స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ గుట్టపల్లి మోహన్‌నాయుడికి రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు లభించింది. సోమవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు.



చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న మోహన్‌నాయుడు

'అగ్రి'లో క్రీడాపోటీలు ప్రారంభం



తిరుపతిరూరల్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాల వేదికగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయవర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల విద్యార్థులకు సోమవారం క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. వర్సిటీపరిధిలో 18కళాశాలలకు చెందిన 410మంది విద్యార్థులు ఈపోటీలలో పాల్గొన్నారు. తొలిరోజు విద్యార్థులకు నిర్వహించిన బాల్‌బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, చెస్, క్యారమ్స్ పోటీలు హోరాహోరీగా సాగాయి. విద్యార్థులు ఉత్సాహంగా ఈ పోటీలలో పాల్గొన్నారు.

